# తరలి రండు



నే నొక రచయితను.

నా కొక సమస్య ఉంది,

'రవి గాంచనిచో కవి గాంచునే కదా!' అందరి సమస్య లకూ పరిష్కార మార్గాలు సూచించగల ప్రతిభావంతు లకు సమస్యలా? ఎంత చిత్రం! అంటే—ఒక్కటే సమాధానం.

నా సమస్య నా ఒక్కడిది మాత్రమే కాదు. అది ఒక విధంగా అందరి సమస్య. ఈనాటి ప్రపంచానికి సంబం

# తరలిరండు

ధించినది కాదు. నిత్య జీవితానికి చెందినది. మనుగడను కూడా శాసించగలదు.

కనుకనే పరిష్కార మార్గాన్వేషణ సులభసాధ్యం కాదు.

కొలది వారాలుగా నన్ను కేవలం రచయితగా మాత్రమేకాక వ్యక్తిగానూ వేధిస్తూన్న ఈ సమస్యను పరిష్కరించలేకపోతే నేమి; పదిమందికి నివేదించుకొంటే బరువయినా తగ్గుతుందని మీ సన్నిధికి వచ్చాను.

ఈనాడు నా దేశం నిర్బంధంగా యుద్ధం చేయవలసిన స్థితి ఏర్పడింది. శత్రువులతో పోరు ముమ్మరంగా సాగుతూంది. మన సైనికులు మాతృదేశ రక్షణ కొరకు, మన అందరి శాంతిభద్రతల కొరకు, తరతరాల భారతీయులకొరకు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు.

తోడి భారతీయుడనైన నేను, రచయితనని చెప్పుకొనే నేను ఈ తరుణంలో ఏమి చేయాలి? ఏమి చేయగలను? ఏమిచేసి మాతృభూమిపట్ల ఉన్న ప్రేమను వ్యక్తం చేసుకోగలను? ఏ విధంగా నా తల్లి ఋణం తీర్చుకొనడానికి ప్రయత్నించగలను?

ఇదే నా సమస్య.

నా సమస్య నా తోడి రచయితలది కూడా.

నేను రచయితను అనడంకన్న పోరాడడానికి అశక్తుణ్నే అని చెప్పుకొంటే నా బరువు కొంత తీరుతుందేమో?

నేను రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో జన్మించాను. యుద్ధం గురించి చదివానేకాని కనీసం రెండవ ప్రపంచ యుద్ధాన్ని అయినా చూడలేదు. కనుక యుద్ధం గురించి రచించే యోగ్యత నాకు లేదు.

నాతోడి భారతీయులు ప్రాణాలు అర్పించి పోరాడుతుండగా అనుభవ రహితమైన నా రచనలతో ఎవరిని ఉత్తేజపరచగలను?

అలా అని ఏమీ చేయక ఊరక ఉండడం నన్ను నేను శపించుకొనడమే అవుతుంది. అంతటి ఘోరాపరాధం నేను చేయలేదే?

పోనీ—

మాతృదేశ స్వాతంత్ర్య సమరంలో అయినా పాల్గొని ఉంటే ఆ అనుభవం నాకు ఉపకరించి ఉండేది.

జ్ఞప్తికి తెచ్చుకోనివ్వండి.

ఆఁ! ఉండండి. ఎక్కడినుంచో రక్తం ఉడుకెత్తించి ఆవేశంతో పరవళ్ళు తొక్కించే వీరగీతం వినిపిస్తూంది.

'తరలి రండు తనయులార
వరగున సాహసము తోడ
భరతమాత భండనమునకున్!'

అరె!

ఆ వచ్చేది గురునాథంగారు కాదూ? అవును, ఆయనే. ఎన్నడూ లేనిది అలా పరుగెడుతున్నారేం?

"ఏం బాబూ, ఏమిటా కంగారు? ఏమైనా—"

"మావాడికి ప్రాణంమీదికి వచ్చిందోయ్! డాక్టరు దగ్గరికి పోతున్నాను. మరేం అనుకోకు. వస్తాను, కవీ!"

తెలుగువారి దృష్టిలో రచయితలందరూ కవులే! అదలా ఉంచుదాము.

ఎంత మాట అన్నారు! కుమార్‌కు ప్రాణంమీదికి వచ్చిందా! ఇలాంటప్పుడు కూడా మర్యాద మరవడు, మహానుభావుడు! అనుకోవడమా? ఎంత మాట!

పాపం, కుమార్‌కు ఏమైందో?

నిన్న సాయంకాలం కూడా వాళ్ళ స్కూల్లో సైనికులను రిక్రూయిట్ చేసేటప్పుడు హెడ్‌మాస్టర్ గది దగ్గర తారట్లాడుతూ కనిపించాడు. మరి అప్పుడు మామూలుగానే ఉన్నాడే?

ఆఁ. ఇప్పుడు జ్ఞప్తికి వస్తూంది. కుమార్ నన్ను చూచి కూడా పలకరించకుండా ముఖం తిప్పుకొన్నాడు. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. హెడ్‌మాస్టరు దేశభక్తి ప్రబోధించే కథలు పిల్లలకు చెబుతారా అంటే ఆ ఆనందంలో మునిగి నేనే కుమార్ సంగతి పట్టించుకోలేదు.

కథలంటే జ్ఞాపకం వచ్చింది—

కుమార్ కథలంటే చెవి కోసుకొంటాడు. అందులోనూ వీరగాథలంటే మరీ ప్రీతి.

అవును. ఆశ్చర్యంలేదు. చిన్నతనంలో అంతకంటె పిల్లలకు ప్రీతిపాత్రమైన గాథలు మరేమి ఉంటాయి? అలా చిన్నతనంలో వీరగాథలు విని, అజరామరమైన కీర్తిగాంచిన మహా వీరులు ఛత్రపతి శివాజీవంటి మహనీయుల జీవితాలే కథలుగా గాథలుగా తరతరాల భారతీయులను ఉత్తేజపరచడం లేదూ, మరి?

కొంపదీసి, మన కుమార్, ముక్కుపచ్చలారని మన కుమార్ కూడా సైన్యంలో చేరి మాతృదేశ రక్షణ కొరకు పోరాడాలని తపిస్తూ ఉండి, జ్వరం తెచ్చుకోలేదు కదా?

రెండవ ప్రపంచ యుద్ధం సాగుతున్నకాలంలో ఎందరెందరో అమెరికన్ బాలురు తమ నిజమైన వయస్సు కప్పిపుచ్చి సైన్యంలో చేరి యుద్ధంలో పాల్గొనడానికి ప్రయత్నించిన ఉదంతాలు మనకు తెలుసు.

కుమార్ విషయంలోనూ అంతే జరిగిందేమో? ఎవరు చెప్పగలరు?

"ఎవరు చెప్పగలరు? హెడ్‌మాస్టారు చెప్పినదాన్ని బట్టి కుమార్ సైన్యంలో చేరడానికి ప్రయత్నించిన మాట నిజమని తేలింది. వాళ్ళు 'వయసు చాలదు. పెద్దవాడివయ్యాక చేరుదువుగానిలే, నాయనా. వెళ్ళు'—అనగానే మనవాడు ఏడుపు లంకించుకొన్నాడు. జ్వరం ముమ్మరంగా వచ్చేసింది. హెడ్‌మాస్టారు బండిలో ఇంటికి దిగబెట్టించారు.

"ఇదంతా చూస్తే మీవాడికి ఈ యుద్ధ వ్యాధి అంకురించిందని తేలుతుంది.

"ఇంజెక్షన్ ఇచ్చానుకదా? చెప్పినట్లు గంట గంటకీ మందు ఇవ్వండి. అవసరమైతే కబురు పంపండి. వస్తాను.

"భయపడకండి. ఇప్పటి కేమీ ప్రమాదం లేదు."

రోజులు, వారాలు గడిచిపోతున్నాయి. స్మృతి వచ్చిందన్నమాటే గాని కుమార్ స్థితి గంట గంటకూ దిగజారిపోతూంది.

ప్రమాదం లేదని చెప్పిన డాక్టరు వీరభద్రంగారే ప్రమాదం శంకిస్తున్నా రిప్పుడు.

ఏకైక కుమారుడు అలా జీవచ్ఛవంలా రోజుల తరబడి మంచంమీద పడిఉంటే ఏ తల్లి సహించగలదు?

డాక్టరుగారిని కాళ్ళా వేళ్ళాపడి ప్రాధేయ పడుతూంది ఆ తల్లి.

"బాబూ, నాకు పుత్రభిక్ష పెట్టండి!"

"తల్లీ, మీవాడికి నేను మంత్రసానిగా ఉన్నాను. వాడు మీకెంతో నాకూ అంతే. నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. ఆ భగవంతుడే మనల్ని కాపాడాలి."

"ఏం చేయమంటారు, డాక్టరుగారూ? అహర్నిశమూ ఇలా కళ్ళల్లో వత్తులు పెట్టుకొని ఏమీ చేయలేక నిస్సహాయంగా కూర్చోవడం మాకు రంపపు కోతగా ఉంది. కుమార్ నాన్నగారు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టడంలేదు. మమ్మల్నేం చేయమంటారు, డాక్టరుగారూ?"

"అమ్మా, ఉన్నమాట చెబుతున్నాను. జాగ్రత్తగా వినండి. మీవాడికి ఒంట్లో ఏమీలేదు. అంతా బాగానే ఉంది.

"కాని, వాడు విరక్తి పెంచుకొన్నాడు. దేనిమీదైనా—తినుబండారం కావచ్చు, ఆట వస్తువు కావచ్చు, సర్కస్ కావచ్చు, సినిమా కావచ్చు—దేనిమీదైనా ఆసక్తి పుట్టించు, తల్లీ. వాడి ప్రాణానికి నేను హామీ ఇస్తాను."

"పసివాడికి విరక్తా? అర్థం కావడం లేదు, బాబూ."

"అవునమ్మా, విరక్తే. సైన్యంలో చేరాలని మనసుపడ్డాడు. అది వీలు కాదనడంతో జీవితాన్నే అసహ్యించుకొంటున్నాడు, మీవాడు. పసిపిల్లలంతే నమ్మా."

ముద్దుల కుమారుని ముచ్చట ఏమిటో తెలుసుకొని తీర్చాలని, దక్కించుకోవాలని ఆ తల్లితండ్రులు చేసిన ప్రయత్నం అంతా ఇంతా కాదు. అంతా వ్యర్థం. బూడిదలో పోసిన పన్నీరే అయింది.

మంచినీళ్ళు కూడా తాగడం మానేశాడు కుమార్. ప్రాణం కడంటింది. జ్యోతి కొడిగట్టే స్థితి ఆసన్నమైంది.

ఇప్పుడు డాక్టరు వీరభద్రంగారు కూడా కుమార్ గదిలోనే, కుమార్ మంచం పక్కనే స్థిరనివాసం ఏర్పరుచుకొన్నారు.

తల్లితండ్రుల మాట దేవుడెరుగు—డాక్టరుగారు కూడా పచ్చి మంచినీళ్ళు ముట్టడంలేదు.

ఆ గదిలో దృశ్యం హృదయవిదారకం.

కుమార్ కాళ్ళదగ్గర తల్లి మంచం కోడుమీద తల ఆనుకొని రెండు చేతులతో ముఖం కప్పుకొని తనలో తనే కుళ్ళి కుళ్ళి ఏడుస్తూంది.

తండ్రి కుమార్ తలవైపు కుర్చీలో శిలావిగ్రహంలా, ఎర్రటి కళ్ళతో ప్రేలడానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతాన్ని తలపుకి తెస్తూ కూర్చుని ఉన్నాడు.

కుమార్ మంచం పక్కనే డాక్టరుగారు కూర్చున్నారు. ఆయన దృష్టి కుమార్ ముఖంమీద కేంద్రీకృతమై ఉంది. కుమార్ కుడిచేయి పట్టుకొని నాడి పరిశీలిస్తూ ఉన్నారు. ఆయన మనసు ఎక్కడ ఉందో

**తూలికాభూషణ్**

ఆ పెరుమాళ్ళకే ఎరుక.

చీమ చిటుకుమన్నా కుమార్‌కు ప్రాణహాని శంకించే ఆ నిరవ నిశ్శబ్ద నిరాశాపూరిత వాతావరణంలో—

ఎవరిదో అడుగుల సవ్వడి. అనుమానంగా గది వెంటనే నిలిచినట్లయింది.

అంతలో—"డాక్టరుగారూ!" అని సన్నగా ఒక పిలుపు.

డాక్టరుగారి సమాధికి భంగం కలిగలేదు.

"బాబూ! అబ్బాయిగారి దగ్గరినుంచి ఉత్తరమండీ! ఒక బంగీ కూడా వచ్చిందండీ."

డాక్టరుగారిలో రవంత చలనం కనిపించింది.

"అబ్బాయిగారికి వీరచక్రం బహూకరించినట్లు ప్రభుత్వంవారు పంపిన టెలిగ్రామ్ కూడా..."

డాక్టరుగారు ప్రకృతంలో వచ్చారు.

"అబ్బాయి—సుందరానికి వీరచక్రం! సుందరం, సుందరం, సుందరం...."

తనలో తనే గొణుక్కొంటున్నట్లు అంటున్నారు డాక్టరుగారు.

ఎక్కడిదో, ఏ లోకంలోనుంచో, ఎవరిదో హీనస్వరం వినిపించింది.

డాక్టరు వీరభద్రంగారు మరల గంభీరులై పోయారు. మరింత తీవ్రంగా కుమార్ ముఖ కవళికలు పరిశీలిస్తున్నారు. కుమార్ చేయి గట్టిగా పట్టుకొన్నారేమో, రక్తనాళాలు ఉబికాయి.

"సుందరం మామయ్యా! వచ్చాడా?"

స్వరం ఆగిపోయింది.

మంచం చుట్టూ ఉన్న ముగ్గురూ మరో లోకంలో ఉన్నారు.

డాక్టరుగారే మొదట ప్రకృతంలో వచ్చారు. ఆయన పెదవులమీద చిరుదరహాసం లాస్యం చేస్తోంది. తల్లి తండ్రులు ఇద్దరూ ముగ్ధులై ఆయనవంకనే చూస్తున్నారు.

"సుందరం మామయ్య. మై గాడ్! ఎంత పిచ్చివాడినైపోయాను!

"భగవాన్! నా అపరాధం మన్నించు, తండ్రీ!

"నా కళ్ళు ఇప్పటికైనా తెరిపించావు. ధన్యుణ్ణి!"

తనలో తనే గొణుక్కొన్నారు డాక్టరుగారు.

అంతలో ముందుకు వంగారు. కుమార్ చెవిలో సన్నగా అన్నారు:

"బాబూ, సుందరం మామయ్య వచ్చాడు. చూస్తావా?"

కుమార్ కదిలాడు. డాక్టరుగారివైపు చూశాడు. అతడి చూపు గుమ్మంవైపు తిరిగింది. అంతలో అతని కళ్ళలో తిరిగి నైరాశ్యం అలముకొంది. డాక్టరువైపు చూపు మళ్ళించాడు.

"లేడే!" మళ్ళీ అదే హీనస్వరం.

ఈ పర్యాయం డాక్టరుగారి కళ్ళలో ఆనందం తొణికిసలాడింది.

"బాబూ! సుందరం మామయ్య వచ్చాడు. నిజంగా. నిన్ను చూస్తానంటున్నాడు. ఇంత నీరసంగా ఉన్నప్పుడు నిన్ను చూడకూడదని నేనే వద్దన్నాను.

"నీకు నిజంగా సుందరం మామయ్యని చూడాలని ఉందా?"

"ఊఁ!"

"మరయితే గ్లూకోజ్ తాగుతావా?"

ఒక్క యుగంలా తోచిన ఒక్క క్షణం తరువాత అదే హీనస్వరం—

"ఊఁ!" అంది.

తల్లి చేతులతో ఇచ్చిన గ్లూకోజ్ తాగాడు కుమార్.

మరునాడు సుందరం మామయ్యను చూపుతానన్నారు డాక్టరుగారు. అంతవరకు చెప్పినట్లా విని, ఇచ్చినదంతా తాగడానికి కుమార్ సమ్మతి పొందారు.

తల్లి తండ్రులను బయటికి పిలిచి, తన ఆదేశాలు అక్షరం తప్పకుండా అమలుపరచమని నొక్కి చెప్పారు. కుమార్ ప్రాణానికి ప్రమాదం లేదని భరోసా ఇచ్చారు.

ఇంతచేసినా, డాక్టరు వీరభద్రంగారికి మాత్రం నమ్మిక కుదరలేదు.

సుందరం మామయ్యా! అని కుమార్ పిలిచే తన కొడుకు సుందరం—ఫ్లైట్ లెఫ్టినెంట్ సుందరం—పాకిస్తాన్ యుద్ధ విమాన విధ్వంసక కార్యక్రమంలో నిమగ్నుడై వేలమైళ్ళ దూరానికి వెళ్ళిన సుందరం, వీరచక్రం పొందిన సుందరం—ఇప్పుడు ఎక్కడ?

సుందరానికి పిల్లలంటే ప్రేమ. గురునాథంగారి కుమార్ అంటే మరీను.

కథలు వినడంలోనుంచి కథా నాయకుల కబుర్లు వినేటంతవరకూ పరిణతి చెందాడు కుమార్.

క్షణమైనా సుందరాన్ని విడిచేవాడు కాదు కుమార్.

సెలవులో సుందరం ఎప్పుడు వచ్చినా కుమార్‌కు పండగే.

నిన్న మొన్న సెలవులో వచ్చిన సుందరం ఉన్నతాధికారుల తాకీదు అందుకొని ఉన్నపళంగా యుద్ధరంగానికి వెళ్ళిపోయాడు—కుమార్‌తో చెప్పనైనా చెప్పకుండా.

తాను కూడా సేనలోచేరి, తన సుందరం మామయ్యతో కలిసి యుద్ధంచేసి, వీరత్వం పొందాలని కుమార్ కాంక్ష. తీరనిదని తేలిపోయింది.

సుందరం మామయ్యతో ఎడబాటు భరించలేకపోయాడు. సుందరం మామయ్య ఏమయ్యాడో అని భయపడ్డ మాట కూడా నిజం. తను దగ్గర ఉంటే సుందరం మామయ్యను కాపాడవచ్చు.

అంతే. కుమార్ ప్రాణంమీదికి తెచ్చుకొన్నాడు.

ఇప్పుడు ఏమిటి కర్తవ్యం?

ప్రాణప్రదమైన భార్య మృతిచెందినా, ఏకైక కుమారుడు యుద్ధరంగంలో క్షణక్షణమూ మృత్యువును ఎదిరించి పోరాడుతున్నా చలించి ఎరగని డాక్టరు వీరభద్రంగారి తలవెంట్రుకలు ఆ రాత్రి శ్వేతవర్ణం సంతరించుకొన్నాయి.

తెల్లవారింది.

గడువు సమీపించింది.

కుమార్ మళ్ళీ ఎప్పటిలా దిగజారిపోతున్నాడని, ఏ క్షణమైనా దీపం కొడిగట్టవచ్చని కబురు అందింది డాక్టరుగారికి.

ఏమి చేయడానికీ పాలుపోని డాక్టరుగారి చేయి అప్రయత్నంగా జేబులోకి వెళ్ళింది. చేతికి కవరు తగిలింది. తీశారు. సుందరం వద్దనుంచి క్రిందటి రోజు వచ్చిన కవరది. చించి చదివారు. మళ్ళీ ఆయన పెదవుల మీద చిరునగవు నాట్యమాడింది.

ఒంటరిగా వచ్చిన డాక్టరు గారివంక, గుమ్మంవంక, తిరిగి డాక్టరుగారివంక నిర్లిప్తంగా, నిర్మమత్వంతో చూచిన కుమార్—

డాక్టరుగారి వైఖరిలో ఏదో కొత్తతనం కనిపించిందేమో—

అలాగే ఆయనను పరిశీలిస్తున్నాడు.

డాక్టరుగారు కుమార్ చేయి అందుకొన్నారు.

తల్లితండ్రులు చిత్తరువుల్లా ఉభయులూ మార్చి మార్చి చూస్తున్నారు.


అంతలో—

"కుమార్! కుమార్!"

ఎక్కడినుంచో గంభీరమైన స్వరం వినవచ్చింది.

కుమార్ గుమ్మంమీదికి దృష్టి మరలించాడు. దాని మీదనే కేంద్రీకరించాడు.

(తరువాయి 62 వ పేజీలో)



అనభిముఖుడు

చిత్రం—ఆంజనేయులు (మద్రాసు.14)

**అంకితం**

మాతృదేశ రక్షణకొరకు ప్రాణాలర్పించి పోరాడుతున్న జవాన్లకు

రచయిత

# జ్వాలాతోరణం!

ఎల్లోరా

ఉత్తప్పుడు దీపం
ఆర్పుకుంటే తప్పు!
ఆత్యయిక స్థితిలో దీపం
వెలిగించడం తప్పు!!

నరకాసురుణ్ణి పరిమార్చి
చేసుకొంటూంది లోకం దీపావళి,
శత్రునిబర్నాణంచేసి, భారత్
చేసుకొంటుంది విజయ దీపావళి!

గుండెల్లో జ్వాలా తోరణం
మంటలై నింగినంటుతూంది!
గుండ్లకు గుండె లొడ్డి జనత
'కొబ్లాట్'లో 'క్రాంతి' సాధిస్తూంది!

భారతం పొలిమేరలో దీపావళి
మొన్ననే ప్రారంభమ్మైంది!
టపాసులకు బదులు తుపాకుల
విజయగర్జన వినిపిస్తూంది!

అమ్మ పక్కలో ఉన్నట్లుండి
పసిపాప నిద్రలో కెవ్వుమంది!
నరకాసురుడు అదిగో అని
భయం చూపు మూల చూసింది!!
ఎవరమ్మా ఆ బూచాడు అంటే
'అయూబు, అమ్మో' అంది!

ఆకాశంలో శాంతికపోతం
భయంతో గిజగిజమంది!
సహజీవన నవభారతం
సరిహద్దు ఎరుపెక్కింది!

విశ్రాంతిలోవున్న శాంతి సైనికుడు
శాంతి హస్తంతో గన్ పట్టాడు!
పాకిస్తాన్ మందేహాలకు
క్రాంతిజనత ఎదురునిలిచింది!

సరిహద్దున జ్వాలా తోరణం
కాలుతూంది చూడు!
శాంతి ఇలను సాధించగ
ప్రాణమొడ్డి పోరు!! ★

## తరలి రండు

(7 వ పేజీ తరువాయి)

"వింటున్నావా, కుమార్? నేను, సుందరం మామయ్యను!"

"వింటున్నాను!" కుమార్ గొంతు హీనంగా అయినా ఆనందమే ధ్వనించింది.

"కుమార్! నాకోసం బెంగపెట్టుకోకు. నేను బాగానే ఉన్నాను.....

"నేనూ నీలాగే చిన్నప్పుడు సైన్యంలో చేరాలని తహతహలాడాను. కొన్నాళ్ళు పోనిమ్మన్నారు. బాగా చదువుకొని పెద్దవాణ్ణయి ఇప్పుడు నిజంగా యుద్ధం చేస్తున్నాను. చూశావా, మరి?....."

"ఓ" అన్నాడు కుమార్.

"నువ్వు కూడా బాగా చదువుకొని పెద్దవాడివైతే, సైన్యంలో చేరుదువుగాని. మనం ఇద్దరం కలిసి యుద్ధం చేద్దాం. సరేనా?...."

"ఓ! ఓ!" అన్నాడు కుమార్.

"మా నాన్నగారు ఇప్పుడప్పుడే నీకుకనపడవద్దన్నారు. మళ్ళీ రేపువచ్చి మాట్లాడతాను. గ్లూకోజా అవీ తీసుకొంటావా, మరి?......"

"అమ్మా! గ్లూకోజే!" అన్నాడు కుమార్.

"కుమార్‌కు ఇంకేమీ భయంలేదు. వస్తాను" అన్నారు డాక్టరు వీరభద్రంగారు.

కుమార్ ఆరోగ్యం చక్కబడింది. తల్లితండ్రుల మనసులు కుదుటబడ్డాయి.

కాని, కుమార్ మాత్రం జీవితంలో మరెన్నడూ సుందరం మామయ్యను చూడలేదు.

ఆ తరువాత డాక్టరుగారి ఆరోగ్యం దిగజారి పోయింది. మళ్ళీ ఆయన ముఖంలో చిరునవ్వు చూసిన వారు ఎవరూ లేరు.

కుమార్ జబ్బుగా ఉన్న సంగతి తండ్రి లేఖద్వారా తెలుసుకొని కుమార్ జబ్బుకు కారణం ఊహించి, తన మాటలు టేప్ రికార్డుచేసి, అధికారుల ప్రత్యేకానుమతితో పంపి కుమార్ ప్రాణం కాపాడిన సుందరం మామయ్యకు —

ప్రభుత్వం వీరచక్రం బహూకరించి సన్మానించిన సుందరం మామయ్యకు—

ఆ బహుమతి సుందరం మామయ్య వీరమరణం పొందిన తర్వాతనే లభించిందని కుమార్‌కు చెప్పేవారెవరు?

అంతటి దుఃఖాన్ని కడుపులోనే దాచుకొని కుమార్ ప్రాణం కాపాడిన త్యాగమూర్తి డాక్టరు వీరభద్రం గారు భరతమాత అనుంగు బిడ్డలలో అగ్రగణ్యులని చెప్పనివారెవరు?

'తరలి రండు తనయులార
నరగున సాహసముతోడ
భరతమాత బంధనముసకున్!'

జయ్ హింద్! ★

## బస్సుస్టాండులో కిష్టమ్మ

(55 వ పేజీ తరువాయి)

"పాపం! వాడిమీదనుంచి లారీ వెళ్ళిపోయిందట, సార్. అదుగో, జనం వెళ్ళిచూస్తున్నారు" అన్నాడు జనం గుంపుగా చేరిన చోటుచూపిస్తూ.

ఆఫీసరు హడావిడిగా అటు పరుగెత్తాడు. జనాన్ని త్రోసుకుంటూ లోపలికి వెళ్ళాడు. కిష్టమ్మ బాధగా మూలుగుతూ జనంకేసి చూస్తున్నాడు. ఆఫీసరు కనుపించగానే తలతిప్పి "సార్, మీరా?" అన్నాడు.

"అవును. నేనేనోయి. నీకో ప్రజంటేషన్ పట్టుకొచ్చాను. నీకోసం వారంరోజులనుంచి చూస్తున్నాను" అన్నాడు బాగ్‌లోంచి నోట్ల, కట్ట తీసి.

కిష్టమ్మ ఏదో చెప్పదలచి నోరు విప్ప సందేహించాడు.

"కిష్టమ్మా! ఏదైనా చెప్పదలిస్తే సందేహించకు. నేను నీ తండ్రినోయి" అన్నాడు.

కిష్టమ్మ చిరునవ్వు నవ్వుతూ, "నాకు తెలుసు, సార్!" అన్నాడు. అంతే. కిష్టమ్మ తల ప్రక్కకు వాలిపోయింది. కళ్ళు మూతలు పడ్డాయి. ★